కథ

# వివాహయోగం

వీర్రాజు పెళ్లిచూపులకి ఎంతమంది అమ్మాయిల్ని చూసేడో చెప్పడం చాలా కష్టం. అతనంటే కిట్టనివాళ్లు 'వాడు చూసిన అమ్మాయిల్ని వరుసగా పక్కపక్కని నిలబెడితే ఆ లైను ఊరవతలకి పోతుంది' అని అంటూంటారు. అంతమందిని చూసినా ఇంకా పెళ్లి కాకపోవడానికి కారణం- అమ్మాయిలు అతనికి నచ్చక కాదు. అమ్మాయిలకే అతను నచ్చేవాడు కాదుట. అదీ సంగతి.

ఓ శుభముహూర్తాన వీర్రాజులో ఏం అందం చూసిందో వీడి క్లాస్‌మేట్ లలిత వీణ్ణి ప్రేమించేసింది. ''కానీ ఒక షరతు. మా అమ్మగారికి కూడా నువ్వు నచ్చాలి. అందుకని వేసంగి శెలవుల్లో మా ఊరు వచ్చి మా అమ్మగార్ని కలు'' అని సలహాతోబాటు ఎడ్రెస్ ఇచ్చింది.

వేసంగి శెలవులొచ్చాయి. వీర్రాజు వాళ్లమ్మగారి సలహా ప్రకారం, ఓ మంచిరోజు చూసుకుని, 'ఓహో నా పెళ్లంట' అని ఈలపాట పాడుకుంటూ లలిత వుంటున్న కుయ్యేరుకి బయలుదేరాడు.

కుయ్యేరులో ఎడ్రెస్ వెతుక్కుంటూ సివంగి సుబ్బలక్ష్మి ఎస్.పి అని బోర్డు వున్న ఇంటిముందాగి, ''సుబ్బలక్ష్మిగారున్నారా?'' అని అడిగాడు.

ఇంతలోనే లలిత బయటికొచ్చి ''లేరండి, హైదరాబాద్ వెళ్లేరు'' అంటూ ''ఓ! మీరా? ఎప్పుడొచ్చేరు?'' అంది మెల్లిగా, ఆశ్చర్యంగా.

''ఇప్పుడే. ఔను...ఇది మీ ఇల్లా?'' అడిగాడు ఇంకా మెల్లిగా.

లలిత మేనమామ, అతని భార్య మంగమ్మగారు ముందుకి దూకి ''ఏం కావాలి? ఎవరు నువ్వు?'' అని అరిచారు కోపంగా.

''నేను ఇంజనీరు నారాయణరావుగారి అబ్బాయిని. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సివంగి సుబ్బలక్ష్మిగారితో మాట్లాడాలని వచ్చేను. మా అమ్మగారు ఆవిడ్ని కలవమన్నారు.''

''ఆవిడ రేపుకానీ రారు. కేంప్ వెళ్లారు. రేపురా'' అన్నారు దురుసుగా.

'ఈయనతో మాట్లాడి లాభంలేదు. సుబ్బలక్ష్మిగారితో మాట్లాడమని అమ్మ ముందే చెప్పింది. సరే రేపటి దాకా ఆగుతా' అనుకున్నాడు మనసులో.

''ఎక్కడుంటారు మామయ్యా? ఈ ఊళ్లో మంచి హోటల్సేనా లేవు. అందాకా మనింట్లో వుండనిద్దాం'' ఏం పరిచయం లేనిదానిలా అంది లలిత.

''సరే లోపలికి తగలడు'' అని గొణుక్కుంటూ చుట్ట వెలిగించుకుంటూ ఇంకోవైపు వెళ్లిపోయేరు నరసింహంగారు, 'కాదు' అంటే సుబ్బలక్ష్మిగారు ఏం చేస్తుందో అని భయపడుతూ.

వీర్రాజు లోపలికి అడుగుపెట్టాడు సామానులతో. ఎవ్వరూ పూలదండలతో, మంగళ హారతులతో, పువ్వులు జల్లుతూ లోపలికి తీసుకెళ్లలేదు. 'ఈ గదిలో వుండొచ్చు' అంటూ ఒక గది మేడ మీద చూపించి, లలిత హాల్లో సోఫాలో ఏదో పత్రిక చదువుతూన్నట్లు కూర్చుంది.

వీర్రాజుకి ఏం చెయ్యాలో తోచలేదు. సరే ముందు స్నానం అవీ కానిచ్చి, తర్వాత వివరంగా లలిత తండ్రి భూషణంగారితో మాట్లాడొచ్చు అని అనుకున్నాను. అలా అనుకుంటూ గది బయటకొచ్చి డాబా మీద నుంచుని ''అసలు సంభాషణ ఎలా మొదలుపెట్టాలి'' అని ఆలోచిస్తూ పరాగ్గా అక్కడ పడివున్న అరటిపండు తొక్క మీద కాలు వేసి జర్‌ర్‌ర్‌మని జారి కింద పడిపోకుండా నిలదొక్కుకోడానికి, పక్కనే డాబా పిట్ట గోడ మీదున్న పువ్వుల కుండీని కౌగలించుకోబోయి, ఆ కుండీని కిందకి తోసేసాడు. అప్పుడే చుట్ట కాల్చుకుంటూ వనవిహారం చేస్తున్న నరసింహంగారి తలని ముట్టుకోనా వద్దా, ముట్టుకోనా వద్దా అనుకుంటూ ఆ పువ్వుల కుండీ గట్టిగా ముద్దెట్టుకుంది.

నరసింహంగారు కోపంతో పైకి చూసేసరికి వెర్రి మొహం వేసుకుని ఏదో విసిరినట్లు చేతులు వున్న భంగిమలో వీర్రాజు కనిపించేడు. నరసింహంగార్ని చూడగానే, వీర్రాజు ఆయనకి కనిపించకూడదని ఒక్క అడుగు వెనక్కి వేశాడు, 'నన్నసలు చూళ్లేదు, బ్రతికేనా దేముడా' అనుకుంటూ.

రాత్రి పదయింది. ఎవరో తన గదిలోకి వస్తున్నట్లు వినిపించింది వీర్రాజుకి. లలిత వస్తూందనుకుని మురిసిపోయేడు. ఇంతలోనే రానే వచ్చేసింది ఆ ఇంటి వాళ్లు పెంచుకుంటున్న కుక్క. వీర్రాజుకి కుక్కలంటే ప్రాణభయం. గిత్తంత ఎత్తున్న ఆ కుక్కని చూడగానే పై ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి. ఆ కుక్క వీర్రాజుని ''ఎవడ్రా వీడు? మనింట్లో వున్నాడు'' అన్నట్లు చూసింది.

వీర్రాజు స్నానం అవీ చేసి ఫ్రెష్‌గా తయారయి లలితతో కబుర్లు చెబ్దామనుకున్నాడు. కానీ లలిత తండ్రి భూషణంగారు అతన్ని జలగలా పట్టుక్కూర్చున్నాడు, అటు ఇటు కదలనివ్వకుండా ఏవో కబుర్లు చెప్తూ.

ఓ గంటయ్యాకా పిలుపులతో అందరూ భోజనాలకి డైనింగ్ టేబుల్ దగ్గరకి చేరారు. నరసింహంగారు తన భారీ శరీరాన్ని లాక్కుంటూ ఒక కుర్చీలో కూలబడ్డారు. ఇందాక తలకి తగిలిన బొప్పిని తడుముకుంటూ, మెల్లిగా తల పైకెత్తారు. ఎదురుగుండా కూర్చున్న వీర్రాజుని చూశారు. అగ్నిహోత్రుడైపోయారు. ''అసలు ఎవరు నువ్వు? ఎవరు నిన్నిక్కడ కూర్చోమన్నారు?''

''సుబ్బమ్మని వాళ్ల అమ్మగారు కలవమన్నారుట. అందుకని మనింటికొచ్చి తిష్టవేశాడు'' అంది భార్య మంగమ్మగారు.

సుబ్బలక్ష్మి పేరు చెప్పగానే నరసింహంగారు చల్లబడిపోయేరు- ఇతన్ని ఏమంటే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని. కోపంగా వీర్రాజుకేసి చూసి, బొప్పి తడుముకుంటూ తల వంచుకు కూర్చున్నారు. భోజనాలయ్యాయి.

రాత్రి పదయింది. ఎవరో తన గదిలోకి వస్తున్నట్లు వినిపించింది వీర్రాజుకి. లలిత వస్తూందనుకుని మురిసిపోయేడు. ఇంతలోనే రానే వచ్చేసింది ఆ ఇంటివాళ్లు పెంచుకుంటున్న కుక్క. వీర్రాజుకి కుక్కలంటే ప్రాణభయం. గిత్తంత ఎత్తున్న ఆ కుక్కని చూడగానే పై ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి. ఆ కుక్క వీర్రాజుని ''ఎవడ్రా వీడు? మనింట్లో వున్నాడు'' అన్నట్లు చూసింది.

వీర్రాజుకి చమటలు పట్టి ఆ కుక్క కేసి చూస్తున్నాడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని. మెల్లిగా ఆ గదిలోంచి ఎలా పారిపోదామా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆ కుక్కకి అక్కడ మంచం కింద ఒక ఎలక పిల్ల కనిపించింది. ఆ ఎలకని బయటకి లాగడానికి పీకే ప్రయత్నంలో వుంది. ఇదే అదననుకుని వీర్రాజు మునికాళ్ల వేళ్లమీద మెల్లిగా బయటకి జారుకోడానికి ప్రయత్నం చేశాడు. ఇది కనిపెట్టిన కుక్క ఒక్క ఉరుకులో అతని మీదకి దూకింది, ఎవడో దొంగ వెధవ అయి వుండాలి వీడు అని అనుమానంతో. వీర్రాజు గుండె గుభేల్మని ఒక్కగంతులో పైనున్న ఫేన్‌ని పట్టుకు వ్రేలాడేడు ఆ కుక్కకి దొరక్కుండా. వీర్రాజు క్రిందకి దిగితే కరిచి చంపేద్దామని, ఒక కన్ను అతని మీద, ఒక కన్ను ఎలక పిల్ల మీద వేసి అక్కడే కూర్చుంది.

వీర్రాజుకి ఏం చెయ్యాలో తోచలేదు. లలిత దగ్గరకి వచ్చినప్పుడు ఫైవ్‌స్టార్ చాక్లెట్స్ ఇద్దామని జేబులో పెట్టుకున్నట్లు జ్ఞాపకం వచ్చింది. కుక్కని మచ్చిక చేసుకోడానికి ఒక చాక్లెట్‌ని కుక్క దగ్గరకి విసిరేడు. ఆ చాక్లెట్‌ని తిని 'ఓ చాక్లెట్ ఇచ్చినాసరే, నువ్వు కిందకి దిగు, నీ పనుంది' అని వీర్రాజు వైపు గుర్రుగా చూసింది కుక్క.

ఇలా కాదని మెల్లిగా కాళ్లతో ఫేనుని ఎలాగో గట్టిగా పట్టుకుని, క్రిందికి వ్రేల్లాడుతూ ఆ కుక్కని మెల్లిగా దువ్వడం మొదలెట్టాడు. ఆ కుక్క కూడ 'నాకేం

నష్టం' అన్నట్లు ఒళ్లంతా ఎక్కడా వదలకుండా తనివితీరా గోకించు కుంది.

కుక్కని మచ్చిక చేసుకోగలిగా ననే ఆనందంతో క్రిందికి దిగగానే ఆ కుక్క ఇంక ఏదైనా ఫైవ్‌స్టార్ చాక్లెట్సో బిస్కట్లో ఇస్తున్నాడేమోనని ఆశగా చూసింది. కానీ వీర్రాజు అదను చూసి బయటికి దూకే ప్రయ త్నంలో వున్నాడు. తన జేబులో వున్న ఓ ఫైవ్‌స్టార్ చాక్లెట్‌ని ఓ మూల పాత సామాన్ల వైపు విసిరాడు. ఆ కుక్క చాక్లెట్ విసిరిన చోటుకి ఒక్క దూకులో వెళ్లి అక్కడ వున్న ఇనుప వూస గుచ్చుకుని కుయ్యో మొర్రో అంటూ గట్టిగా అరవడం మొదలె ట్టింది.



అదే అదనుకుని తలుపు వైపు పరిగెత్తి గబగబా బయటపడి బ్రతుకు జీవుడా అనుకుంటూ తలుపు గొళ్లెం పెట్టాడు.

కుక్క పెట్టిన అరుపులకి మెలు కువ వచ్చి నరసింహంగారి భార్య పైకి నౌకరును పంపించింది.

''అమ్మగారు మిమ్మల్ని చూసి రమ్మన్నారండి''

''నాకేం. బాగున్నాను'' అన్నాడు వీర్రాజు.

''మిమ్మల్ని కాదండి. ఆ కుక్కని మీరు నానా హింసలు పెడ్తున్నారని, ఆ కుక్కని మీ బారినుండి రక్షించి రమ్మని పంపించేరండి''

''ఆ?!!!''

''ఔనండి. పైగా మీమీద 'బ్లూక్రాస్' వాళ్లకి రిపోర్ట్ చేసి మీరు జంతువులని హింసిస్తున్నారు అని చెప్పి, తమకి తగిన శిక్షపడేలా చూస్తామన్నారండి.''

''ఎందుకొచ్చాన్రా దేముడోయ్ ఈ అడవిలోకి'' అని వీర్రాజు తల పట్టుక్కూర్చున్నాడు.

''అడవయినాసరే. మీరు కదలడానికీల్లేదండి. ఈ రాత్రికి తమర్ని ఆ గదిలోనే బంధించమన్నారండి.''

''ఆ గదిలోనా?''

''ఆయ్''

''కుక్కుందయ్యా''

''మీకు భయమేంటండీ. మీరే ఆ కుక్కని కరిసిన ట్లున్నారని మాయమ్మగారి అనుమానమండి!''

''ఏం చేయన్రోయ్ దేవుడోయ్?''

''అంతేనండి. ఈ రాత్రికి ఆ గదిలోనే తమరి మకాం''

''చూడు బుల్లయ్యా...ఏంటి నీపేరు మల్లయ్యం టావా?...సరే...చూడు మల్లయ్యా! ఇప్పుడేమో రాత్రి పన్నెండు అయింది. టైమ్ తెలీక, నువ్వు తెల్లారిందను కుని లేచినట్లున్నావ్. ఈ గడియారం చేతికి పెట్టుకో. ఏదైనా పీడ కలొచ్చిందా? ఇలా లేచి వచ్చేవ్?'' అంటూ తన చేతి గడియారాన్ని అతని చేతికి పెట్టేడు. ''నిద్రలో నడిచే అలవాటుంటే డాక్టరుకి చూపిం చుకో'' అని లాలనగా సలహా ఇచ్చేడు.

''ఏంటో బాబూ, నాకంతా అయోమయంగా వుంది'' అన్నాడు. తన కనుమానమొచ్చింది ఒకవేళ తనకేమైనా కల వచ్చిందేమోనని.

''సరిగా నిద్రపో...పిచ్చి పిచ్చి ఆలోచన్లు పెట్టు కోక...ఔను. ఇక్కడ కరెంటు పోవడం వల్ల ఫేను లేదు. గాలీ లేదు. నిద్రపట్టడం లేదు. కాస్సేపు చల్లగాలిలో తిరుగుతా. బయటకి ఎటు వెళ్లాలి?''

ఎల్లయ్య వినయంగా తలుపులు తెరిచి బయటకి దారి చూపించేడు.

వీర్రాజు బయటకి ఒక్కదూకు దూకి బతుకు జీవుడా అంటూ అక్కణ్ణించి పరుగు లంకించుకు న్నాడు.

అర్ధరాత్రి ఎవడో దొంగ పరిగెడుతున్నాడనుకుని వీధి కుక్కలు అతణ్ణి వెంబడించాయి.

ఆరోజే వీర్రాజు తెలుసుకున్నాడు తనకి పెళ్లయ్యే యోగం ఈ జన్మలో వుండదని, తను రాకెట్ వేగంగా పరిగెత్తగలడని.

★

భావరాజు